



శంకుస్థాపన ప్రదేశంలో వివిధ స్థలాల మట్టి వద్ద నమస్కరిస్తున్న చంద్రబాబు



జగన్ కూల్చివేసిన ప్రజావేదికను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రపంచ రాజధాని అమరావతి.. అడవిలా మారిన వైనాన్ని, ఆంధ్రుల కలల రాజధాని.. శ్మశాన వైరాగ్యంలో చిక్కుకున్న తీరును. నవ్యాంధ్ర అభివృద్ధికి సంకేతంగా ఉండాల్సిన అమరావతి.. విధ్వంసమైన వైనాన్ని చూసిన చంద్రబాబు ఆవేదన చెందారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వెంటాడిన విధ్వంసక పీడనను, కమ్ముకున్న నిశ్శబ్దాన్ని, అలుముకున్న చీకట్లను అధిగమించి అమరావతిని అభివృద్ధి పథాన నడిపిస్తానని అభయం ఇచ్చారు. అమరావతి భవిష్యత్‌నకు సంకేతంగా నిలిచిన నిలువెత్తు కట్టడాలను.. అత్యద్భుత నిర్మాణాల పునాదులను.. ఐదేళ్ల పాలనలో జగన్ గాలికి వదిలేయడాన్ని ప్రత్యక్షంగా చూసిన చంద్రబాబు చలించిపోయారు. ఐదేళ్లుగా రహదారులు, భవనాలు నిర్లక్ష్యానికి బలైపోవడం చూసిన నవ్యాంధ్ర రాజధాని సృష్టికర్త చంద్రబాబు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో అమరావతిని అభివృద్ధి పథాన నడిపించాలన్న దీక్ష తన పర్యటనలో కనబరిచారు. అదే హామీని రాజధానివాసులకు కూడా ఇచ్చి ధైర్యం చెప్పారు.

ఆవేదన.. అభయం



ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, మంత్రి నారాయణ



నీటిలో నానుతున్న సచివాలయ టవర్స్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

- అమరావతిలో సీఎం చంద్రబాబు పర్యటన
- వైసీపీ నిర్లక్ష్యానికి బలైన నిర్మాణాల పరిశీలన
- శంకుస్థాపన ప్రదేశంలో సాష్టాంగ నమస్కారం
- ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి పర్యటన ప్రారంభం
- రాజధాని రైతుల త్యాగాలను శ్లాఘించిన ముఖ్యమంత్రి
- అమరావతి స్థల మహత్యమే విధ్వంసాన్ని తట్టుకోగలిగింది
- 1631 రోజులు యజ్ఞం చేసి అమరావతిని మహిళలు కాపాడారు
- సంపద కేంద్రాన్ని ధ్వంసం చేయాలని చూసినా పోరాడి నిలిచింది
- ఐదేళ్ల విధ్వంసంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తానన్న ముఖ్యమంత్రి



వారిది విధ్వంసం.. మాది బాధ్యత

ప్రజల సంపద.. సంపద సృష్టి కేంద్రం.. స్వయంపోషక నగరమైన అమరావతిపై ఐదేళ్లలో వైసీపీ నేతలు విషం గక్కారు. బ్రాండ్ ఇమేజ్‌ను చంపేయాలనుకున్నారు.. అని చంద్రబాబు తెలిపారు. ఐదేళ్ల నిర్లక్ష్యానికి బలైన అమరావతిని చూసి చలించిపోయిన చంద్ర బాబు సీఆర్‌డీఏ కార్యాలయంలో రాజధాని రైతులు, మీడియాతో మాట్లాడారు. అమరావతి దుస్థితిని చూసినప్పుడు చెప్పలేని బాధ, ఆవేదన కలిగాయని చెప్పారు. శంకుస్థాపన ప్రాంతంలో పవిత్రమైన మట్టిని భద్రపరిస్తే ఆ మట్టిని రాజధాని రైతులు ఐదేళ్లపాటూ కాపాడారన్నారు. మాస్టర్‌ప్లాన్ నమూనాను అల్లరిమూకలు దెబ్బ తీసేందుకు కూడా యత్నించారన్నారు. 1631 రోజులపాటు రాజధాని రైతులు, మహిళలు యజ్ఞం చేసి అమరావతిని కాపాడుకున్నారన్నారు. వారి త్యాగం మరువలేనిదంటూ వారిని అభినందించారు. రాజధానిలో నిలిచిపోయిన భవనాలు చూస్తే ఆవేదన కలిగిందన్నారు. ఐదేళ్ల క్రితం వేసిన మట్టి అలానే ఉందన్నారు. పైపులు, ఇసుక దొంగలించుకుపోయారన్నారు. రోడ్డు కోసం వేసిన మట్టిని కూడా తవ్వుకుపోయారని తెలిపారు. ఒక్క భవనాన్ని కూడా గత ప్రభుత్వం ముట్టుకోలేదని, దేన్నీ పట్టించుకోలేదని వాటిని చూస్తే ఏమి చేయాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐదేళ్లలో రోడ్లు, భవన నిర్మాణాలన్నీ పూర్తి చేసుకునేవని చెప్పారు. 80 శాతం పనులు పూర్తి అయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లు ఎక్కడివక్కడే ఆగిపోయాయన్నారు. కార్యదర్శులు, ప్రిన్సిపల్ కార్యదర్శుల భవనాలు తుమ్మ చెట్లతో నిండిపోయాయని తెలిపారు. గ్రూప్-4 ఉద్యోగుల భవనాలు సగంలో ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుజాతి గర్వంగా, సగౌరవంగా చెప్పుకునే రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. రాజధాని నిర్మాణం విషయంలో అధైర్యం వద్దని, బాధ్యతగా నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు. వైసీపీ పాలన ఎంత విధ్వంసకరంగా జరిగిందో పోలవరం, అమరావతిని పరిశీలిస్తే తెలుస్తుందన్నారు.



గ్రూప్ డి హౌసింగ్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న చంద్రబాబు



హైకోర్టు వద్ద చంద్రబాబుకు అభివాదం చేస్తున్న ప్రజానీకం



అమరావతి ఆర్ట్ గ్యాలరీలోని నమూనాలు పరిశీలిస్తున్న చంద్రబాబు

తుళ్లూరు/ గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండు కళ్లలాంటి పోలవరం, అమరావతిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇటీవల పోలవరంలో పర్యటించిన ఆయన గురువారం అమరావతిలో పాదం మోపారు. అమరావతిలో వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సృష్టించిన విధ్వంసాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా చూసి చలించిపోయారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంసకర పాలనకు నిదర్శనంగా నిలిచిన అమరావతిని చూసిన ఆయన ఆవేదన చెందారు. వైసీపీ ప్రభుత్వం తొలుత పడగొట్టిన ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచి ముఖ్యమంత్రి అమరావతి పర్యటన ప్రారంభమైంది. ప్రజావేదిక వద్ద శిథిలాలను పరిశీలించారు. విధ్వంసంతో మొదలైన వైసీపీ పాలన విధ్వంసకరంగానే సాగిందని ఆవేదన చెందారు. అక్కడి నుంచి ఉద్దండరాయునిపాలెంలోని రాజధాని శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్దసంఖ్యలో రాజధాని ప్రాంతవాసులు అక్కడకు చేరుకుని చంద్రబాబు కోసం వేచి చూశారు. పవిత్రమైన మట్టి, పుణ్యజాలలతో చేసిన స్థూపాన్ని సందర్శించి సాష్టాంగ నమస్కారం చేశారు. మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాలతో పాటు అక్కడున్న యజ్ఞశాలలను, మాస్టర్‌ప్లాన్ నమూనా మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. దాన్ని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన తీరును చూసి చంద్రబాబు ఆవేదన చెందారు. అనంతరం హైకోర్టు క్రాస్ రోడ్డులోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల్ని పరిశీలించారు. మూడంతస్తుల వరకూ మెట్లు ఎక్కి భవనాల్లోని గదులను పరిశీలించారు. ఆ తర్వాత ఆలిండియా సర్వీసెస్ జూనియర్ ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. అక్కడ నుంచి సెక్రటేరియట్ భవనాల కోసం వేసిన పునాదులను పరిశీలించి అవి నీటిలో నానిపోయి ఉండటాన్ని చూసి చలించిపోయారు. వాటి పరిస్థితిపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలను పరిశీలించారు. సగంలో ఆగిపోయిన వాటి దుస్థితిని గమనించారు. అక్కడి నుంచి హైకోర్టు మీదగా జడ్జిల భవన సముదాయాలను పరిశీలించేందుకు బయలుదేరగా, హైకోర్టు న్యాయవాదులు ఆయన కాన్వాయ్ వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి అభివాదం చేశారు. ఆ తర్వాత న్యాయమూర్తులు, మంత్రుల గృహ సముదాయాలను చూసుకుంటూ సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట పురపాలక శాఖామంత్రి నారాయణ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కొలికిపూడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పురపాలక శాఖ కమిషనర్ సింగాల్, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కరరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, అమరావతి మహిళా జేఏసీ నేత శిరీష, పులి చిన్నా, టీడీపీ నేతలు, అమరావతి రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్థల మహత్యమే.. కాపాడింది

ప్రముఖ ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేసి పవిత్రమైన మట్టిని, నదుల నుంచి పుణ్యజలాలను తెచ్చి అమరావతికి శంకుస్థాపన చేశాం. స్వతంత్ర్య సమర యోధులు, త్యాగమూర్తుల జన్మస్థలాల నుంచి మట్టిని, జలాలను తెచ్చాం. ఆ మహిమే ఈ రోజు అమరావతిని కాపాడింది. అమరావతి పవిత్రమైన ప్రాంతంగా మారింది. తాత్కాలికంగా కొంతమంది ఈ ప్రాంతాన్ని అతలాకుతలం చేయాలనుకున్నా ఆ స్థల మహత్యం వల్ల మళ్లీ తిరిగి నిలబెట్టుకోగలిగాం.

ఆలోచించండి..

వైసీపీకి ఓటు వేసి వారు ఐదేళ్లలో రాష్ట్రం ఏవిధంగా నష్టపోయిందో తెలుసుకోవాలి. ఐదేళ్లలో ఎలా ఉండాల్సిన రాజధాని ఎలా ఉందో ఒక్కసారి అర్థం చేసుకోవాలి. అమరావతిలో జరిగిన విధ్వంసాన్ని చూసి జగన్‌రెడ్డి పాలన గురించి ఆలోచించాలి. ఇటువంటి వారు రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి తిప్పలు తప్పవు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, ముఖ్యమంత్రిగా అర్హత లేని వ్యక్తి ఆ పదవి వస్తే ఏమిచేస్తాడో ఈ ఐదేళ్లు చూశాం. రాష్ట్ర ప్రజలు ఒక్క సారి తాము ఎవరిని కోరుకున్నామో ఆలోచించాలి. అమరావతి, పోలవరం వ్యక్తిగత సంపద కేంద్రాలు కావు. ఏ ఒక్క వ్యక్తికో, వర్గానికో ప్రాంతినికో పరిమితమైనవి కావు. ఇవి సంపద కేంద్రాలు. సంపద సృష్టిస్తే సమాజానికి పనికివస్తుంది. వ్యక్తులు బాగుపడతారు. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించవచ్చు. కానీ ఐదేళ్ల జగన్ దీనిని విస్మరించి.. అటు పోలవరం, ఇటు అమరావతిని పాడుబెట్టి ప్రజలను నష్టపరిచాడు.







నిర్మాణానికి నోచుకోకపోవడంతో నిలిచిపోయిన రాజధానిలోని భవనాలు

రెవెన్యూ మంత్రిగా అనగాని

- బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్
- శాఖను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్న మంత్రి
- భూముల రీసర్వేలో రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

రేపల్లె, జూన్ 20: ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న ఆయనకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన గురువారం వెలగపూడి సచివాలయం నాలుగో బ్లాకులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ మంత్రిగా వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు మంత్రితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్ జనార్ధన్, నాదెండ్ల మనోహర్, బాలవీరాంజనేయ స్వామి, సవిత, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, గళ్లా మాధవి, ఎంఎం కొండయ్య, చింతమనేని ప్రభాకరరావు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ తదితరులు అనగానికి అభినంధనలు తెలిపారు.

జవాబుదారీతనాన్ని పెంపొందిస్తా

రెవెన్యూ శాఖలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కోర్టు కేసుల సమర్థ నిర్వహణకు ఆన్‌లైన్‌లో రెవెన్యూ కోర్టు విధానం ప్రవేశపెడతామన్నారు. రెవెన్యూ సిబ్బందికి శిక్షణ కోసం ప్రత్యేకంగా రెవెన్యూ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఏపీ రెవెన్యూ శాఖను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో జారీకి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో కొంతమంది మంత్రులు ఇష్టానుసారంగా భూములను ఆక్రమించారన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో జగన్ అండ్ కో ప్రభుత్వ భూములను తక్కువ ధరలకే కట్టబెట్టి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, వాటిపై విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తామని మంత్రి తెలిపారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌తో రెవెన్యూ అధికారులు

పట్టాలెక్కిన అమరావతి రైలు

- స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం
- రైల్వే మంత్రిత్వ శాఖ గజిట్ నోటిఫికేషన్ జారీ
- ఇక భూసేకరణ సులభతరమని తేల్చిన రైల్వేవర్గాలు
- ఇదో శుభ పరిణామం అంటున్న అమరావతి రైతులు



గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలో ఏపీకి మంజూరైన అమరావతి నూతన రైలుమార్గం తిరిగి ఎన్‌డీఏ-3లో పట్టాలపైకి వచ్చింది. అమరావతి నూతన రైలుమార్గాన్ని స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఈ మేరకు భూసేకరణ నిమిత్తం తాజాగా ఆ శాఖ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అమరావతి రైలు మార్గం కోసం ఏపీలోని గుంటూరు, ఎన్‌టీఆర్, పల్నాడు, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో భూములను సేకరించాల్సి ఉన్నది. కేంద్రం తాజా నిర్ణయం వల్ల భూసేకరణ సులభతరం అవుతుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. ప్రజావసరాల కోసం జాతీయ మౌలిక సదుపాయాలు కల్పించే క్రమంలో అమరావతి రాజధాని నూతన రైలుమార్గాన్ని స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా కేంద్రం పరిగణిస్తున్నట్లు పేర్కొన్నది. మరికొద్ది రోజుల్లో కేంద్రంలో ఏర్పడిన ఎన్‌డీఏ-3 ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ని ప్రవేశపెట్టబోతుండటంతో అమరావతి రైలుమార్గం ప్రాజెక్టు భూసేకరణకు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. మొదట్లో ఇది కాస్టు షేరింగ్ ప్రాజెక్టు. నిధుల కొరతతో రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేంద్రమే ఈ ప్రాజెక్టుని చేపట్టాలని విజ్ఞప్తి చేయగా సొంత నిధులతోనే పూర్తి చేయాలని రైల్వే శాఖ భావించింది. ఇప్పుడు టీడీపీ ఆధారిత ఎన్‌డీఏ-3 ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టిన దృష్ట్యా కేంద్రమే భూసేకరణ చేసే అవకాశం ఉన్నది. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు వారాల వ్యవధిలోనే అమరావతి రాజధానికి మేలు చేసే నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నుంచి వెలువడటం శుభపరిణామమని రైతులు పేర్కొంటున్నారు.

రైలు మార్గం రెండు దశల్లో..

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుబాలెం నుంచి అమరావతి మీదగా నంబూరు వరకు(56.53 కిలోమీటర్లు) తొలి దశలో సింగిల్ లేన్ అమరావతి రైలుమార్గానికి డీపీఆర్ రూపుదిద్దుకొన్నది. ఇది ఒక విధంగా విజయవాడకు బైపాసు రైలుమార్గంగా ఉపయోగపడుతుంది. అలానే నరసరావుపేట నుంచి సత్తెనపల్లి, పెదకూరపాడు నుంచి అమరావతికి కూడా రెండు సింగిల్ లేన్‌మార్గాలను ఇందులో చేర్చారు. వీటిని రెండో దశలో నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తంగా రూ.2,800 కోట్లకు పైగా నిధులు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల రైలువంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుని రైల్వే శాఖ అటకెక్కించింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయిని కూడా కేంద్రం నుంచి అడగలేదు. ఇక అమరావతి రైలుమార్గం మరిచిపోవాల్సిందేనని భావిస్తున్న తరుణంలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం.. కేంద్రంలో చంద్రబాబు కీలకపాత్ర నేపథ్యంలో అమరావతి రైలు ప్రాజెక్టు ముందుకు తీసుకెళుతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది.

గంజాయి విక్రేతల అరెస్టు

● రెండు కిలోలు గంజాయి స్వాధీనం

తెనాలి అర్బన్, జూన్ 20 : గంజాయి అమ్ముతున్న వారితో పాటు విని యోగిస్తున్న వారిని కూడా టు టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రమేష్ వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రెండు కిలోల గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా చోటపల్ గ్రామానికి చెందిన అల్లాడి మణికంఠ ఈశ్వర్, కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన దాసరి శ్రీసాయిశంకర్ భవానీ, గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన రామిశెట్టి శ్యాంవెంకట్, విజయవాడకు చెందిన ఉయ్యూరు కౌషిక్‌రెడ్డి, తెనాలి నందుల పేటకు చెందిన కోటిసాయిమంజునాథ, పెదకాకాని మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి మణికంఠ, నందులపేటకు చెందిన దేవిశెట్టి బసవేశ్వరరావులను అరెస్టు చేశామన్నారు. వీరిలో ముగ్గురు నిందితులు ఒరిస్సాలోని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అమ్ముతున్నారు. వీఎస్ఆర్ కళాశాల వద్ద గంజాయి అమ్మే క్రమంలో అందిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు. టు టౌన్ సీఐ సుధాకర్, సిబ్బంది అనిల్, అంకయ్య, సాంబశివరావు, వెంకటప్రసాద్, గణేష్, దేవదాసులను అభినందించి రివార్డు ప్రకటించారు.



మూల్యాంకనం.. తూతూమంత్రం

● రోజుకు 90 బీఈడీ పేపర్లు దిద్దేస్తున్నారు...
● ఎంఈడీ విద్యార్థులతో బీఈడీ మూల్యాంకనం
● అతిథి అధ్యాపకులే... పర్యవేక్షణాధికారులు
● అధ్యాపకులపై వైసీపీ సలహాదారుడి బంట్రోతు జులుం

గుంటూరు(విద్య), జూన్ 20: అక్రమాలను ప్రోత్సహించడం.. నిబంధనలకు నీళ్ళొదలడంలో దిట్ట అయిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిపాలన గణం బీఈడీ వాల్యూయేషన్‌లోనూ తమ అక్రమాల పరంపరను కొనసాగిస్తోంది. టిక్ కొట్టు.. పైసలు పట్టు అన్నచందంగా వర్సిటీలో బీఈడీ మూల్యాంకనాన్ని నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీస అవగాహన, అనుభవం లేని అధ్యాపకుల్ని మూల్యాంకన అధికారులగా నియమించి కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా మార్చారు. బీఈడీ 2022- 24 సంవత్సరానికి సంబంధించి నాలుగో సెమిస్టర్ మూల్యాంకనం జూన్ ఆరు నుంచి వర్సిటీలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 3, 4 పేపర్ల మూల్యాంకనం సాగుతోంది. వాస్తవంగా ఒక్కో అధ్యాపకుడు రోజుకు కనీసం 35 నుంచి 45 పేపర్లు మాత్రమే వాల్యూయేషన్ చేయాలి. అయితే తాజాగా వర్సిటీలో ఒక్కో ఎగ్జామినర్ చేత 90 పేపర్లు, చీఫ్ ఎగ్జామినర్ల చేత 60 పేపర్లు దిద్దిస్తున్నారు. మూడు నిమిషాలకు ఒక పేపర్‌ను మూల్యాంకనం చేయడం, స్క్రూటినీ చేయడం సాధ్యం కాకున్నా అధికారులు బలవంతంగా చేయాలని వేధిస్తున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 45 పేపర్లకు ఒక డీఏ ఇచ్చారని ప్రస్తుతం 90 పేపర్లకు మూల్యాంకనం చేసినా ఒక డీఏ ఇవ్వకుండా అధ్యపకుల శ్రమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. సమస్యపై పీజీ కోఆర్డినేటర్‌ను కలిస్తే దుర్భాషలాడినట్లు అధ్యాపకులు వాపోతున్నారు. ఈ విషయం గురువారం సాయంత్రం వీసీని కలవడానికి వారు ప్రయత్నాలు చేశారు. ఎంఈడీ అప్రూవల్ అయిన అధ్యాపకుడ్ని చీఫ్‌గా నియమించి బీడీ పేపర్లను ఒక అధికారి అండతో అక్రమంగా మూల్యాంకనం చేయిస్తున్నారని, కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కూడా లేని అతిథి అధ్యాపకుల్ని అధికారులుగా ఎలా నియిమిస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. ఒక అతిథి అధ్యాపకుడు అధికారి హోదాలో మహిళా అధ్యాపకుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలోని కీలక సలహదారుడి కార్యాలయం బంట్రోతుగా ఉంటూ దొడ్డిదారి ఉద్యోగం పొంది ఓ వ్యక్తి పట్టభద్రులపై జులుం ప్రదర్శిస్తున్నాడని బీఈడీ అధ్యాపకులు వాపోతున్నారు.



ద్వారకా తిరుమలరావు, శ్రీనివాస్

వారిద్దరిదీ.. బాల్య స్నేహం

ఇద్దరు డీజీపీలు ఒకే స్కూల్... ఒకే కేడర్ ● ఒకరేమో పాండిచ్చేరి డీజీపీగా శ్రీనివాసన్ ● మరొకరు ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు ● ప్రాథమిక విద్య కృష్ణనగర్ ప్రభుత్వ పాఠశాలలో.. ● సీతారామయ్య హైస్కూల్లో పదో తరగతి వరకు విద్యాభ్యాసం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ చిన్ననాటి నుంచి మిత్రులు.. ఇద్దరూ ప్రాథమిక విద్యను గుంటూరు కృష్ణనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో, హైస్కూల్ విద్యను బృందావన్‌గార్డెన్స్‌లోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. విశేషమేమి టంటే ఉన్నత విద్య కూడా ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఒకరైన సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఇక్కడే పుట్టి పెరిగి ఏపీ కేడర్‌లో ఐపీఎస్(1989) కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ఆ శాఖలో ఉన్నత పదవి అయిన డీజీపీ పోస్టులో తాజాగా నియమితుల య్యారు. ఆయన మిత్రుడు బి.శ్రీనివాసన్ ఏడాది క్రితం పాండిచ్చేరి డీజీపీగా నియమితులై ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఇద్దరు మిత్రులు ఏకకాలంలో వేర్వేరు రాష్ట్రాలకు డీజీపీలుగా పనిచేసే అవకాశం లభించింది. శ్రీనివాసన్ 1990లో ఐపీఎస్‌కు జనరల్ కేటగిరీలో జమ్మూకశ్మీర్ కేడర్‌లో ఎంపికయ్యారు. శ్రీనివాస్ జన్మస్థలం కావలి అయినప్పటికీ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఆయన తండ్రి సదానందరావు ఉద్యోగరీత్యా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రాథమిక విద్య కోసం గుంటూరులోని కృష్ణనగర్ ప్రభుత్వ పాఠశాలలో వీరిద్దరిని తల్లిదండ్రులు చేర్పించారు. అలా వీరిద్దరి మధ్య బాల్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత 1974 నుంచి 79 వరకు గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. విశేషమేమిటంటే వీరిద్దరు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఇద్దరూ కూడా ఐపీఎస్ టార్గెట్‌గా పెట్టుకొని పట్టుదలతో చదివారు. ఇద్దరూ చదువులోనే కాకుండా ఉద్యోగ బాధ్యత నిర్వహణలో కూడా ప్రతిభను చాటుకున్నారు. ప్రభుత్వం నుంచి వివిధ పురస్కారాలు అందుకున్నారు. వీరిద్దరూ డీజీపీ స్థాయికి వెళ్ళినా చిన్ననాటి స్నేహితులను మరిచిపోలేదు. ఎక్కడ పనిచేస్తున్నా గుంటూరు కృష్ణనగర్ పాఠశాలలో తమతో పాటు చదువుకున్న మిత్రులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. అదే పాఠశాలలో చదువుకొని గుంటూరులో ప్రముఖ హోమియో వైద్యుడిగా స్థిరపడిన డాక్టర్ ఓవీ రమణ వీరిద్దరికి అత్యంత సన్నిహితుడు. కాగా ఈ ఇద్దరు డీజీపీలను చిన్నతనంలో తమ విద్యాభ్యాసం ప్రారంభించిన కృష్ణనగర్ పాఠశాలకు త్వరలో పిలిపించి ఆత్మీయ సమావేశం నిర్వహించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని ఆ నాటిమిత్రులు యోచన చేస్తున్నారు.

వైసీపీ బాధిత డీఎస్పీకి విముక్తి



● డీఎస్పీ గోగినేని రామాంజనేయులుపై సస్పెన్షన్ ఎత్తివేత
● నిబంధనలకు విరుద్ధంగా నాలుగున్నరేళ్లుగా సస్పెన్షన్
● లోకేశ్‌కు సన్నిహితుడిగా ముద్రవేసి వేధింపులు
● వైసీపీ అధికారంలోకి రాగానే వీఆర్‌లోకి
● 2020 జనవరి నుంచి నేటి వరకు సస్పెన్షన్ లోనే..

గుంటూరు, మంగళగిరి, జూన్ 20: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అటు టీడీపీలో ముఖ్యంగా పోలీస్‌శాఖలోనూ ఒక వర్గమే లక్ష్యంగా సాగించిన వేధింపులకు ఎందరో బలయ్యారు. వారిలో నార్త్ డీఎస్పీగా విధులు నిర్వహించిన గోగినేని రామాంజనేయు లు ఒకరు. ఆయన విధులు నిర్వహించిన నార్త్ సబ్ డివిజన్ అప్పటి మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఉండడమే ప్రధాన కారణం. ఆయన నార్త్ డీఎస్పీగా పని చేసిన సమయంలోనూ, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ లోకేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినట్లు వైసీపీ భావించి వేధింపులు ప్రారంభించింది. నిరాధార ఆరోపణలతో ఆయనను సస్పెండ్‌తో పాటు కేసు నమోదు చేయడం, అదేవిధంగా ఏసీబీ కేసుకు విఫలయత్నం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నాలుగున్నరేళ్ళ పాటు సస్పెన్షన్‌లో ఉంచింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామాంజనేయులు కు విముక్తి లభించింది. అకారణంగా విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు బుధవారం డీజీపీ జారీచేసిన ఉత్తర్వులు గురువారం వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే..

మంగళగిరి ప్రాంతానికి చెందిన గాయత్రి మిస్సింగ్ కేసులో అప్పటి నార్త్ డీఎస్పీ గోగినేని రామాంజనేయులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వైసీపీ నేతలు ఆకాశరామన్న ఉత్తరం రాశారు. దానిపై డీఎస్పీ రామాంజనేయులుపై రిపోర్టు రాసి సస్పెన్షన్ వేటు వేశారు. వాస్తవానికి గాయత్రి అనే యువతి మహమ్మద్ భాష అనే యువకుడిని ప్రేమించి మతాంతర వివాహం చేసుకొని మహమ్మద్ ఆషాగా పేరు మార్చుకుంది. ఆ తరువాత భార్య, భర్తల మధ్య వచ్చిన వివాదంలో మధ్యవర్తిగా వచ్చిన చిమట రామకోటేశ్వరరావు కొంతకాలానికి గాయత్రితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ తరువాత ఆమెను విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకు వారి మధ్య కూడా మనస్పర్థలు రావడంతో గాయత్రిని రామకోటేశ్వరావు హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ సమయంలో గాయత్రి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయలేదనేది అభియోగం. గాయత్రిని హత్య చేసి మృతదేహాన్ని రేపల్లె సమీపంలోని పెనుమూడి బ్రిడ్జి వద్ద కృష్ణా నదిలోకి విసిరేసినట్లు అభియోగం. అయితే ఆ సమయంలో తనతో పాటు ఉన్న మరో వ్యక్తి సుబ్బారావు ద్వారా ఈ విషయం ఎప్పటికైనా బయటికి వస్తుందనే ఉద్దేశంతో ఆ తర్వాత సుబ్బారావును కూడా రామకోటేశ్వరావు హత్య చేసినట్లు మంగళగిరి పోలీసులకు ఆకాశరామన్న ఉత్తరం అందింది. అయితే ఇందులో గాయత్రి అదృశ్యమైనప్పుడు మిస్సింగ్ ఫిర్యాదు చేస్తే మంగళగిరి ఎస్ఐ, సీఐలు బాధ్యత వహించాలి. అయితే దానితో సంబంధం లేని డీఎస్పీ రామాంజనేయులుపై అభియోగం మోపారు. డీఎస్పీ ఒత్తిడి వల్లే వారు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. తొలుత వైసీపీ అధికారంలోకి రాగానే 2019 జూన్‌లో రామాంజనేయులును వీఆర్‌కు పంపారు. 2020 జనవరి 6న సస్పెన్షన్ వేటు విధించారు. అప్పటి నుంచి ఆయనపై వేధింపుల పర్వం కొనసాగుతూ వచ్చింది.

సివిల్ వివాదంలో బాధితురాలికి న్యాయం చేయలేదని..

మంగళగిరి ప్రాంతంలో విజయవాడకు చెందిన వారు వేసిన రియల్ వెంచర్లో పొన్నాడ నాగమణి అనే మహిళ ప్లాటు కొనుగోలు చేశారు. అయితే అంతకుముందే ఆ ప్లాట్‌ను వేరొకరు కొనుగోలు చేసినట్లు ఆ తర్వాత తెలిసింది. దీంతో బాధితురాలు తన డబ్బు తనకు ఇవ్వమని అడగ్గా వారు కాలయాపన చేస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఎస్పీ ఆదేశాలతో ఈ విషయంలో అప్పటి నార్త్ డీఎస్పీ రామాంజనేయులు తొలుత రియల్ ఎస్టేట్ వ్యాపారులను పిలిపించి మూడు రూపాయలు వడ్డీతో ఆమె డబ్బు ఆమెకు ఇవ్వాలని హెచ్చరించి పంపారు. అయితే సకాలంలో వారు డబ్బులు ఇవ్వకపోవడంతో రామాంజనేయులు వారిని మరోసారి పిలిపించి వారి ద్వారా ఆమెకు చెక్కులు, నోట్లు ఇప్పించి ఆమె వద్ద ఉన్న ఒరిజినల్ దస్తావేజులను వారికి ఇప్పించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన డబ్బులు కోసం ఎన్నిసార్లు డీఎస్పీ కార్యాలయం చుట్టూ తిరిగినా తనకు డబ్బులు ఇప్పించకపోగా రియల్ వెస్టేట్ వెంచర్ వారికి డీఎస్పీ అనుకూలంగా వ్యవహరించారంటూ నాగమణి అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐడీ అడిషనల్ డీజీ పీవీ సునీల్ కుమార్ కేసు నమోదు చేసారు. అయితే అప్పటికే ఈ సివిల్ వివాదంపై బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కావడంతో దీనిపై రామాంజనేయులు హైకోర్టులో పిటిషన్ వేయగా విచారించిన కోర్టు సిఐడి కేసును స్క్వాష్ చేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో అప్పటి ఏసీబీ అడిషనల్ డీజీ పీ సీతా రామాంజనేయులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీలో కేసు నమోదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే డీఎస్పీ రామాంజనేయులు తన ఆస్తులు, ఆదాయపను శాఖకు చెల్లింపులు వంటి ఆధారాల న్నింటినీ ఏసీబీ అధికారుల ముందు ఉంచారు. అయితే అడిషనల్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు నుంచి ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ కింది స్థాయి అధికారులు ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసే ధైర్యం చేయలేకపోయారు.

సస్పెన్షన్‌లో ఉంచడం చట్ట విరుద్ధం

ఏసీబీ కేసులు సహా శాఖాపరంగా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ శాఖలో ఏ ఉద్యోగిని అయినా ఆరు నెలలకు మించి సస్పెన్షన్‌లో ఉంచకూడదు. ఆరునెలల్లో ఆయనపై వచ్చిన అభియోగాలను విచారించి కేసుపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. అందుకు విరుద్ధంగా విచారణ అధికారులు ఎవరైనా ఆ తర్వాత కూడా సస్పెన్షన్ కొనసాగిస్తూ వస్తే వారిపై సంబంధిత ఉద్యోగి తగు చర్యలు తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. అయితే డీఎస్పీ రామాంజనేయులు కేసు విచారణ అధికారిగా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను నియమించారు. మొదటి రెండేళ్లు విజయవాడ కమిషనర్‌గా చేసిన శ్రీనివాసులు, ఆ తర్వాత కమిషనర్‌గా చేసిన కాంతి రాణాటాటా కేసు విచారణ జరపకుండా ఆరు నెలలకు ఒకసారి సస్పెన్షన్‌ను పొడిగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలిస్తూ వచ్చారు. హైకోర్టు ఉత్తర్వులు పురస్కరించుకుని టీడీపీ ప్రభుత్వం డీఎస్పీ రామాంజనేయులుపై ఉన్న సస్పెన్‌ను ఎత్తివేస్తూ బుదవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ ఉత్తర్వులు అందుకున్న రామాంజనేయులు విధుల్లో చేరుతున్నట్లు గురువారం సాయంత్రం డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

29న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), జూన్ 20: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించడానికి ప్రతి కోర్టులో ఓ న్యాయమూర్తితో పాటు ఇరువురు న్యాయవాదులతో బెంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరు పక్షాల వారితో సామరస్య పూర్వకంగా చర్చించి రాజీమార్గంలో కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమైతే ఆయా కేసుల్లో కక్షిదారులు వారు చెల్లించిన కోర్టు ఫీజును వాపసు పొందవచ్చన్నారు. లోక్ అదాలత్ అవార్డు మీద అప్పీల్‌కి వెళ్లే అవకాశం లేదని తెలిపారు. కక్షిదారులందరూ రాజీమార్గంలో లోక్ అదాలత్ ద్వారా తమ కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, ధనాన్ని వృథా కాకుండా కాపాడుకోవచ్చన్నారు. సివిల్, రాజీ పడదగ్గ క్రిమినల్, వివాహ సంబంధిత, రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రభుత్వం చేసిన భూ సమీకరణలకు సంబంధించిన కేసులు, కన్స్యూమర్ కోర్ట్ కేసులు, లేబర్ కోర్టు కేసులు ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00



రైల్‌వికాస్ భవన్‌లో జరిగిన డీఆర్‌యూసీసీ చివరి సమావేశంలో పాల్గొన్న సభ్యులు, డీఆర్ఎం, ఇతర అధికారులు

ఐఆర్‌టీటీసీకి పలు రైళ్లను ప్రతిపాదించాం

డీఆర్‌యూసీసీ సమావేశంలో సభ్యులకు అధికారుల సమాధానం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే టైంటేబుల్ కోఆర్డినేషన్ సమావేశం(2024)కి పలు రైళ్లను గుంటూరు మీదగా ప్రతిపాదించామని రైల్వే అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్‌యూసీసీ ప్రస్తుత కమిటీ చివరి సమావేశం డీఆర్ఎం ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. వాటిపై అధికారులు స్పందిస్తూ పినాకిని ఎక్స్‌ప్రెస్‌ని న్యూగుంటూరు రైల్వేస్టేసన్ మీదగా మళ్లించాలని ప్రతిపాదించామన్నారు. అలానే సికింద్రాబాద్ - రేపల్లె నెంబరు. 17645 రైలుకి వేమూరులో నిలుపుదల కోసం రాశామన్నారు. వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని డైలీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. కాచీగూడ - నడికుడి ప్యాసింజర్ రైలుని వినుకొండ వరకు న్యూపిడుగురాళ్ల మీదగా నడపాల్సిందిగా ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. అయితే హెడ్‌క్వార్టర్స్ నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు, ఆర్‌వోబీల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. చివరిగా డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌కి ఇప్పటికే కొన్ని గతిశక్తి కార్గో టెర్మినల్స్ వచ్చాయని, దీంతో సరుకు రవాణ గణనీయంగా పెరిగిందన్నారు. అలానే రాబోయే రోజుల్లో మరికొన్ని జీసీటీలు రాబోతోన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎం కే సైమన్, వివిధ విభాగాల సీనియర్ అధికారులు డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, ఎం దినేష్‌కుమార్, జేవీ అనూష, జి.సూర్యనారాయణ, బి.లక్ష్మణ్, సీఆర్ సర్కార్, కె.సత్యహరప్రసాద్, కమలాకర్‌బాబు, భారత్, ఈ.సుదర్శన్‌రెడ్డి, సభ్యులు ఆర్‌కేజే నరసింహం, కే కిషోర్‌బాబు, సురేష్‌బాబు, పీ వెంకటేశ్వరరావు, జే శ్రీనివాసరావు, కే రమేష్, ఎం పోలేశ్వరరావు, వీరరాఘవయ్య పాల్గొన్నారు.

నీట్ పరీక్షా ఫలితాలపై విచారణ జరిపించాలి

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్

గుంటూరు(తూర్పు), జూన్20: నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు నాసర్‌జీ, వలి డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట, భగత్ సింగ్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని.. నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలన్నారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర్ కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ వెబ్‌సైట్ మొరాయింపు

● రుణాల కోసం టీచర్లకు తప్పని ఇబ్బందులు

గుంటూరు(విద్య), జూన్ 20: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 8 వేల మంది పంచాయతీరాజ్ టీచరు, 2 వేలమందికి పైగా ఉన్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రాంగ సిబ్బంది, ఉద్యోగుల భవిష్యనిధి(పీఎఫ్) ఖాతాలను గుంటూరు జిల్లా పరిషత్ గుంటూరు కార్యాలయం నిర్వహిస్తుంది. ప్రతి నెల జీతాల బిల్లు నుంచి మినహాయించిన నెలసరి పీఎఫ్ చందాలను సీఎఫ్ఎంఎస్ నుంచి వచ్చిన డేటా ఆధారంగా సంబంధిత టీచర్లు, ఉద్యోగుల వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలలోకి జమ చేస్తారు. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అందరికీ అందుబాటులో ఉండేలా జడ్పీ వైబ్‌సైట్‌లో వివరాలు ఉంచుతారు. గత 6 నెలలుగా జడ్పీ వైబ్‌సైట్ నిర్వహణ ఆపి వేయటం వలన ఈ స్లిప్పులు ప్రదర్శించడం లేదు. స్లిప్ కావాలంటే జిల్లాపరిషత్‌లోని పీఎఫ్ సెక్షన్‌లో ఆఫ్‌లైన్‌లో తీసుకోవాల్సిందే. పదవీ విరమణ చేసిర ఉపాధ్యాయులు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యంలందరూ పీఎఫ్ ముగింపు (క్లోజర్) దరఖాస్తులకు కుడా ఈ స్లిప్స్ కావాలి. ఇవి పూర్తి డేటాతో అందుబాటులో లేక వీరు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి వీలైనంత త్వరలో అప్‌డేట్ డేటాతో పీఎఫ్ స్లిప్స్ ను జడ్పీ వైబ్‌సైట్‌లో ఉంచవలసినదిగా టీచర్లు కోరుతున్నారు.



మాట్లాడుతున్న హృదయరాజు

జీవోనం 117ను తక్షణం రద్దు చేయాలి

●ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

గుంటూరు(విద్య), జూన్ 20: ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన జీవోనం 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ (1939) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హృదయరాజు మాట్లాడుతూ 1నుంచి 5తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల ప్రవీణ్ ప్రకాశ్ ఒత్తిడి మేరకు జిల్లా అదికారులు జారీ చేసి చార్జ్ మెమోలను రద్దు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు గోవిందు వెళాంగణిరాజు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ఇతర సదుపాయాలను వర్తింపు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల్లో వెంటనే సబ్జెక్టు టీచర్స్‌ను నియమించాలని కోరారు. ఈ సమావేశం రాష్ట్ర నాయకులు జి.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

50,599 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,771 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 50,599 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,079 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17500	334	9000	16000
నెంబరు. 5	9000	15000	నెంబరు. 5	15000	15000
273	9000	15500	273	14000	14000
341	8000	17000	341	8000	17000
4884	--	–	4884	17200	17200
సూపర్ 10	14500	14500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	20000	తేజ	8500	19700
బ్యాడిగి	9000	16500	బ్యాడిగి	10000	17000
దేవనూరు డీలక్స్	10000	15000	దేవనూరు డీలక్స్	14000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	12500

బాపట్ల వార్తలు

నేడు నరేంద్రవర్మ ప్రమాణస్వీకారం


ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల,జూన్ 20 : దశాబ్దకాలానికి పైగా బాపట్ల నియోకవర్గ ప్రజలకు విద్య, వైద్య, సేవ, ఉపాధి కార్యక్రమాల ద్వారా విశిష్ఠ మన్ననలను పొందిన వేగేశన నరేంద్రవర్మ కల నెరవేరింది. రాజకీయనాయకునిగా ప్రజలకు సేవలు మరింత చేరువచేయాలనే ఆలోచనతో రాజకీయ రంగప్రవేశం చేసి తెలుగుదేశంపార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ నియోకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి అధినేత చంద్రబాబునాయుడును మెప్పించి బాపట్ల బరిలో ఎమ్మెల్యేగా పోటీచేసి రెండు దశాబ్దాల తర్వాత తెలుగుదేశంపార్టీకి విజయం తీసుకొచ్చిన ఘనత నరేంద్రవర్మకే దక్కుతుంది. ఆయన శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మకు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రమాణస్వీకారం తర్వాత బాపట్ల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నరేంద్రవర్మ స్పష్టం చేశారు.

ఉప ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన బాపట్ల ఎంపీ


పవన్‌కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, జూన్ 20 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కె.పవన్‌కళ్యాణ్‌ను బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

యాత్రికుల ప్రాణాలు కాపాడిన పోలీసులకు ప్రశంస

బాపట్ల, జూన్ 20 : సూర్యలంక సముద్రతీరంలో గత రెండురోజులుగా 11 మంది యాత్రీకుల ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ళను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి సముద్రంలో కొట్టుకుపోతున్న యాత్రికుల ప్రాణాలను రక్షించటం అభినందనీయమన్నారు. రాబోయే రోజులలో కూడా పోలీసు శాఖ కీర్తి పెంచేవిధంగా విధులు నిర్వహించాలని కోరారు. సముద్రతీరంలో వివిధ ఘటనలలో అలల తాకిడికి గల్లంతైన యాత్రీకుల ప్రాణాలను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ మస్తానరావు, కానిస్టేబుల్ ఎన్.నాగరాజు, హోమ్‌గార్డులు ఎన్.శ్రీనివాసరావు, పి.రమేష్, కె.ఆశీర్వాదం, కె.వెంకటనారాయణ, గజఈతగాళ్ళు కె.సుబ్బారావు, ఎస్.శివగోపాల్, కె.రామకృష్ణ, కె.బాల కోటేశ్వరరావు, ఎస్.సురేష్, ఎస్.అంజనేయులు, మెరైన్ ఎస్సై నాయుబ్ రసూల్‌లను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. సూర్యలంక, ఓడరేవు, సముద్రతీరాలకు వచ్చేయాత్రికుల రక్షణ కోసం పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


సూర్యలంక సముద్రతీరంలో యాత్రీకుల ప్రాణాలు కాపాడిన పోలీసు సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేసి అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పరిపాలన వ్యవస్థలో రెవెన్యూశాఖ కీలకమైనది

● జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు

బాపట్ల, జూన్ 20 : పరిపాలన వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకమైనదని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఆర్డీవో గంధం రవీందర్‌తో కలిసి డీఆర్‌వో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో మరింత బాధ్యతగా రెవెన్యూ అధికారులు ప్రజలకు సేవలందించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెవెన్యూశాఖాధికారులు, ఉద్యోగుల సేవలు మరువలేనివన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు మరింత చేరవయ్యేలా రెవెన్యూశాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వమే ప్రకటించి జరపటం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని ఆర్డీవో గంధం రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, పర్యవేక్షకులు మల్లేశ్వరి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి విలియమ్స్, డీఎం చంద్రశేఖర్, విశ్రాంత డిఆర్‌వోలు రాధాకృష్ణమూర్తి, నూరు బాషా ఖాశీం, రెవెన్యూ అసోసియేషన్ నాయకు లు సురేష్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూశాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన విశ్రాంత అధికారులను ఘనంగా సత్కరించి సన్మానించారు.



రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన విశ్రాంత అధికారులను సన్మానిస్తున్న డీఆర్‌వో తదితరులు

ఘనంగా హిందూసామ్రాజ్య దినోత్సవం

బాపట్ల, జూన్ 20 : పట్టణంలోని భీమావారిపాలెం పార్క్ వద్ద గురువారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజక్ శ్రీనివాసుల శ్రీనివాసు సభ్యులతో కలిసి హిందూ ధర్మరక్షకుడు ఛత్రపతి శివాజీ, అమ్మవారి పటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజున శివాజీకి ఛత్రపతిగా బిరుదు ఇచ్చి బంగారు సింహాసనంపై ఉంచి పట్టాభిషేకం చేసిన రోజును హిందూసామ్రాజ్య దినోత్సవంగా జరుపుకోవటం జరుగుతుందన్నారు. శివాజీ హిందూ ధర్మరక్షకుడని అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని హిందూ ధర్మరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, కె.శ్రీహరి, జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, మోదడుగు సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు ఎ.రమాదేవి, లక్ష్మీకుమారి, ఓగిరాల శైలజ, బైసాని అరుణకుమారి, కొత్ర పద్మ, రోజారాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీ, అమ్మవారి పటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న సమరసత సేవాఫౌండేషన్ నాయకులు

మూడు గ్రామాల్లో నేను బడికి పోతా కార్యక్రమం

వేమూరు, జూన్ 20 : మండలంలోని చావలి, కోడిపర్రు, పెరవలి గ్రామాల్లో గురువారం ఎంఈవో 2 రోజ్‌ల్యాండ్ అధ్యక్షతన నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శేషగిరిరావు ఆయా గ్రామాల్లోని దళితవాడలు ఎస్టీ కాలనీలలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులు అంగీకరింపజేశారు. పిల్లల చేత మొక్కలు నాటించడం మానవహారంగా ఏర్పాటు చేయడంలాంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను అభ్యసింపజేయాలని తద్వారా ప్రతి కుటుంబం వారి పిల్లల అభివృద్ధిని బట్టి ఆర్థికంగా కూడా బలపడతారని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వీరయ్య, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సచివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనగాని, సోదరుడు శివప్రసాద్


అనగానికి అభినందనలు తెలుపుతున్న బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, పౌరసరఫరాల శాఖామంత్రి మనోహర్

భూముల రీసర్వేలో రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

● రెవెన్యూ శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్


మంత్రి అనగానికి అభినందనలు తెలుపుతున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే సాంబశివరావు

రేపల్లె, జూన్ 20 : భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాం. రెవెన్యూ శాఖలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖామంత్రిగా 4వ బ్లాకులో వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించి పదవీ బాధ్యతలను స్వీకరించారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి రెవెన్యూ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి అనగానికి విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సాంఘీక సంక్షేమ శాఖామంత్రి బాల వీరాంజనేయస్వామి, బీసీ సంక్షేమశాఖామంత్రి ఎస్.సవిత, బాపట్ల ఎంపి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, గల్లా మాధవి, ఎంఎం కొండయ్య, చింతమనేని ప్రభాకరరావు, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు, రాజధాని రైతులు, ఉద్యోగులు జీ.సాయిప్రసాద్, అజయ్‌జైన్, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రేపల్లె నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో సచివాలయానికి చేరుకుని అభినందనలు తెలిపారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి అనగానికి అభినందనలు తెలుపుతున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన

డిప్యూటేషన్‌పై వెళ్లినా.. సిబ్బందిపై ఆగని వైద్యుడి వేధింపులు

- ఉన్నతాధికారి సైతం సర్దుకుపోమ్మని చెప్పినట్లు సిబ్బంది ఆరోపణ

కొల్లూరు, జూన్ 20 : డిప్యూటేషన్‌పై వెళ్లినప్పటికీ ఓ వైద్యాధికారి వేధింపులు సిబ్బంది ఎదుర్కొక తప్పడం లేదు. బాధిత సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరులోని ప్రాథమిక వైద్యశాలలో వైద్యునిగా పని చేసిన డి.రవిబాబు సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడటంతో బాధిత సిబ్బంది ఆయనపై డీఎంహెచ్‌వో, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వైద్యుడిని డిప్యూటేషన్‌పై రేపల్లెకు బదిలీ చేశారు. అయినప్పటికీ వైద్యుని తీరులో మార్పు రాకపోవడం, అక్కడ నుంచి వాట్సాప్‌ల ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, ఫోన్లు చేసి ఇప్పటికీ తమను వేధింపులకు గురి చేస్తుండటంతో విసిగిపోయిన సిబ్బంది, జూనియర్ వైద్యులు డిఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసి ఆయనపై విచారణ చేయాలని కోరామని చెప్పారు. డిఎంహెచ్‌వో సైతం డిప్యూటేషన్‌పై పంపిస్తే విచారణ ఏమిటని చెప్పడం, మళ్లీ ఇటీవల సీనియర్ వైద్యునితో సర్దుకు పోవాలంటూ జూనియర్ డాక్టర్లకు, సిబ్బందికి చెప్పారని ఆరోపణలు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వద్దకు సిబ్బంది వెళ్లి వైద్యుని వల్ల తమకు కలుగుతున్న ఇబ్బందులు, వేధింపుల గురించి వివరించారు. స్పందించిన ఆయన స్థానికంగా ఉన్న టీడీపీ నేత మైనేని మురళీకృష్ణను అసలు విషయం తెలుసుకోవాలని చెప్పడంతో ఆయన సిబ్బందితో బేటీ అయి వైద్యుని అకృత్యాలపై ఆరా తీశారు. సిబ్బంది చెప్పిన విషయాలన్ని వాస్తవాలని ఆయన పంపిన సందేశాలు, సంభాషణలు మైనేనికి చూపించారు. దీనిపై స్పందించిన ఆయన ఒక వైద్యుడు సిబ్బందిపై ఇన్నాళ్లు వేధింపులకు గురి చేస్తున్నా ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడం బాధాకరమని, పైగా డిఎంహెచ్‌వో ఒక మహిళ అయి వుండి కూడా తోటి మహిళలపై జరుగుతున్న వేధింపుల గురించి స్పందించకపోగా సిబ్బందిని వైద్యునితో సర్దుకుపోవాలని సూచించడం అన్యాయమన్నారు. సీనియర్ వైద్యునితో పాటు డిఎంహెచ్‌వోపై కూడా కమిషనర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకుని బాధిత సిబ్బందికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.


సీనియర్ వైద్యుని వేధింపులపై మురళీకృష్ణకు వివరిస్తున్న జూనియర్ వైద్యురాలు, సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

బాపట్ల, జూన్ 20 : జిల్లా రవాణా శాఖాధికారి ఆర్.సురేష్ ఆదేశాల మేరకు బాపట్ల పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ట్రిబుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, వాహనపత్రాలు లేకుండా డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి వారిచేత ఫ్లేకార్డులు చేతపట్టించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని చెప్పించారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి బీవివి రంగారావు, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి కిషోర్, సిబ్బంది ద్విచక్రవాహనచోదకులకు అవగాహన కల్పించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10 కేసులు నమోదు చేశారు. వారికి సుమారు రూ.60 వేల జరిమాన విధించారు. కార్యక్రమంలో రవాణా శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు నడిపేవారు లైసెన్స్ కలిగియుండాలి : సీఐ

కర్లపాలెం, జూన్ 20 : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని రూరల్ సీఐ హజరత్‌బాబు అన్నారు. కర్లపాలెం పెట్రోల్‌బంకు సమీపంలో గురువారం వాహనాల తనిఖీలను నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ హజరత్‌బాబు వాహనదారులకు సూచించారు.

● కొల్లూరు, జూన్ 20 : సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని ఆర్టీవో అంకమ్మరావు డ్రైవర్లకు సూచించారు. గురువారం వేమూరు, కొల్లూరు ప్రధాన రహదారిపై ఆర్టీవో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆటో యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణీకులను తరలించడం నేరమన్నారు. ఆటోలకు సంబంధించిన పత్రాలు లేకుండా నడిపితే జరిమానా విధిస్తామన్నారు. ప్రతి డ్రైవర్ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

కొల్లూరు, జూన్ 20 : ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జన్మదిన వేడుకలు కొల్లూరులో ఘనంగా నిర్వహించారు. గురువారం కొల్లూరులోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ ఆధ్వర్యంలో భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జీ భగవాన్, ఆలపాటి వాసు, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

శివక్షేత్రం ఆధ్వర్యంలో సూర్యలంక తీరంలో వనక్షేత్రం

బాపట్ల, జూన్ 20 : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సూర్యలంక శివక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లా అటవీశాఖ పర్యవేక్షణలో సుమారు 15 ఎకరాల అటవీప్రాంత విస్తీర్ణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అటవీశాఖాధికారి ఎల్.భీమయ్య, అటవీశాఖాధికారి వై.బాలకృష్ణ, వి.శ్రీనివాసరావు, ఇస్మాయిల్ జెబి.ఉల్లా, శివక్షేత్రం కమిటీ నాయకులు మంతెన దశరథ మహరాజు, శ్రీనివాసరాజు, లేళ్ళ వెంకటప్పయ్య, విష్ణురాజు, బుజ్జి తదితరులు కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. జిల్లా ప్రజలు తమ జన్మదినం, ఇతర శుభకార్యక్రమాల సమయంలో శివక్షేత్రం కమిటీకి మొక్కలు అందిస్తే వారి పేరు మీద వాటిని ఇక్కడ నాటి పెంచుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మొక్కలు నాటి నీరు పోస్తున్న అటవీశాఖాధికారులు, శివక్షేత్రం కమిటీ సభ్యులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం, జూన్ 20 : ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలను రైతులకు, సామాన్యులకు చేరవేసేందుకు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మండల తహసీల్దార్ శ్రీశిల్ప అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతాయుతమైన వృత్తిలో పని చేస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకి వారధి లాగా వీఆర్వోలు పని చేయాలని, పేదవాడి సమస్యను పరిష్కరించినపుడే మీ వృత్తికి న్యాయం చేసినట్లు అని తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీశిల్పని మాజీ ఎంపీపీ విచారపు వీర య్య, డిప్యూటీ తహసీల్దార్ మస్తాన్‌రావుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ టి.చంద్రశేఖర్, వీఆర్వోలు, వీఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజలు

ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా విధులు నిర్వహించాలి : ఎంపీడీవో

వేమూరు, జూన్ 20 : ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కార్యదర్శులు, క్రింద స్థాయి ఉద్యోగులు విధులు నిర్వహించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో గురువారం కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే ఉత్తర్వులను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని వాటికి అనుగుణంగా పని చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో కొన్ని కొత్త నిబంధనలు విడుదల అయ్యే అవకాశం ఉందని, వాటిపై అవగాహనతో లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శేఖర్, కార్యదర్శులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

● బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత

బాపట్ల, జూన్ 20 : విద్యాహక్కుచట్టం 2009ని పక్కాగా అమలు చేయాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు గురువారం నాయకులతో కలిసి జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రైవేట్‌స్కూల్స్‌లో అధిక ఫీజులు వసూళ్ళు చేస్తూ, పుస్తకాలు, బ్యాగ్‌లు అని తల్లిదండ్రుల వద్ద పెద్ద మొత్తం వసూళ్ళు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వెనుకబడిన వర్గాల ప్రజలకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇచ్చేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గదే రాజారావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్రనాయకులు తిరుమళ్ళ అమ్మేశ్వరరావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగానికి మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ శుభాకాంక్షలు

బాపట్ల, జూన్ 20 : రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గురువారం మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పార్టీశ్రేణులతో కలిసి వెళ్ళి రాష్ట్ర సచివాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంత్రిగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేసి తీరప్రాంతాన్ని ఇతోధికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ పేరలి సునీల్‌కుమార్, యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్రనాయకులు తిరువీధుల శంకర ప్రసాద్ తదితరులు మంత్రిని కలిసి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.


మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్

తిరుమలకు టీడీపీ అభిమానుల సైకిల్ యాత్ర

భట్టిప్రోలు, జూన్ 20 : టీడీపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావాలని, సీఎంగా చంద్రబాబునాయుడు, వేమూరు ఎమ్మెల్యేగా నక్కా ఆనందబాబు గెలవాలని మండలంలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన ఇరువురు అభిమానులు సైకిల్‌పై తిరుమల వస్తామని మొక్కుకున్నారు. మొక్కులో భాగంగా గ్రామానికి చెందిన 6వ వార్డు పంచాయతీ మెంబర్ జంపని నాంచారయ్య, యార్లగడ్డ సంగయ్య ఇద్దరూ తిరుమల వెళ్ళేందుకు గురువారం గ్రామం నుంచి సైకిల్‌పై బయలుదేరారు. సైకిల్ యాత్రను టీడీపీ మండల కన్వీనర్ వాకా శేషుబాబు, టీడీపీ నాయకులు జంపని వీరయ్య, నూతక్కి దినకర్‌బాబులు టీడీపీ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుమల సైకిల్ యాత్ర దిగ్విజయంగా జరగాలని టీడీపీ నాయకులు ఇరువురికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సైకిల్‌పై తిరుమల బయలుదేరిన పెదపులివర్రు టీడీపీ అభిమానులు

ఆలపాటి బసవపున్నయ్య మృతి

చుండూరు జూన్ 20 : యడ్లపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆలపాటి బసవపున్నయ్య (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. బసవపున్నయ్య భౌతికకాయంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. బసవపున్నయ్య కుటుంబం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో మమేకమై పని చేశారని, ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. బసవపున్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, వేమూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ టీడీపీ నాయకులు, మండల టీడీపీ నాయకులు ఉన్నారు.


బసవపున్నయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆనందబాబు

నాటక కళాకారుడు శివనాగేశ్వరరావు మృతి


శివరావు (ఫైల్)

భట్టిప్రోలు, జూన్ 20 : మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన బూదాటి శివనాగేశ్వరరావు అలియాస్ శివరావు (67) గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగృహంలో కన్నుమూశారు. బ్రహ్మంగారి నాటకంలో ఏకాంబరయోగిగా, తిరుపతమ్మ నాటకంలో వెంకటేశ్వరస్వామిగా, కృష్ణకుచేలలో కృష్ణుడుగా అనేక పాత్రలు ధరించి నంది నాటకోత్సవాలలో బహుమతులను అందుకున్నారు. నాటక రంగానికి గుర్తింపు తీసుకురావడమేకాక భజన కళాకారుడిగా కూడా శివరావు మంచి గుర్తింపు పొందారు. శివరావు మృతి నాటక రంగానికి తీరనిలోటని కళాకారులు, అభిమానులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతికి దీపాల సత్యనారాయణ, జంజనం హేమశంకరరావు, దీపాల సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, కొసనం భాస్కర వెంకటరమణ, మాచర్ల రంగారావు, కొతరపు శివశంకర సిద్ధాంతి, కళాభిమానులు తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అమృతలూరు, జూన్ 20 : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తురుమెళ్ళ గ్రామానికి చెందిన అబ్బాయి కోటయ్య కుమారుడు అబ్బయ్య, అనంతలక్ష్మీల జ్ఞాపకార్థం కుమార్తె యలమంచిలి మనోరమ 55 మంది వయో వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, కొడాలి కోటేశ్వరరావు, నాదెండ్ల దివాకర్, నిర్మల, సులోచన, మాలతి పాల్గొన్నారు.

నేటి నుంచి తురుమెళ్ళ గ్రామ దేవత దేవాలయ వార్షికోత్సవం

అమృతలూరు, జూన్ 20 : మండలంలోని తురుమెళ్ళ గ్రామ దేవత శ్రీ కట్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం శుక్ర, శనివారం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రభ ఊరేగింపు, శనివారం ఏరువాక పౌర్ణమి రోజు కావడంతో జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BeB8vjvలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్‌ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్‌గిల్ భార్య, నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.

గొట్టిపాటి దృష్టికి పులివెందుల సమస్యలు

మంత్రికి వివరించిన బీటెక్ రవి

అద్దంకి, జూన్ 20 : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీ టెక్ రవి) గురువారం కలసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. సచివాలయంలో గురువారం మంత్రిని కలిసిన బీటెక్ రవి పులివెందుల ని యోజకవర్గంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.


గొట్టిపాటికి సమస్యలు వివరిస్తున్న బీటెక్ రవి

పోపూరి దాతృత్వాన్ని కొనియాడిన ఏలూరి

బస్సు షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇనగల్లు(పర్చూరు), జూన్ 20: పర్చూరు మండలం ఇనగల్లు గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం పోపూరి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారులు పోపూరి శ్రీనివాసరావు, రమే ష్ బాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరై బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. వెంకటేశ్వర్లు దశదిన కర్మ కా ర్యక్రమంలో భాగంగా హాజరైన ఎమ్మెల్యే ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు ధూళిపల్లి వెంకటస్వామి, మక్కెన శేఖర్‌బాబు, అడ్డగడ్డ వేణుబా బు, ఫ్యాక్టరీ శ్రీను, మహిళా నాయకులు జయ మ్మ, పోపూరి శ్రీనివాసరావు, రావి రంగనాథబాబు, కాపు రవిచంద్ర, బేతపూడి సురేష్, షేక్ గౌస్, గ్రామస్థులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

శ్రీశైలానికి టీడీపీ నేతల పాదయాత్ర

సంతమాగులూరు, జూన్ 20 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్ భారీ మెజారిటీతో గెలిచి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో సంతమాగులూరు మండలం పత్తేపురం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన పాదయాత్రను టీడీపీ నాయకులు అట్లా చినవెంకటరెడ్డి ప్రా రంభించారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంట లు బాగా పండాలని ఆకాంక్షిస్తూ పత్తేపురం నుంచి గు రువారం శ్రీశైలానికు పాదయాత్ర చేపట్టారు. ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రకు సంతమాగులూరు, పుట్టావారిపాలెం, కామేపల్లి, వెల్లలచెరువు వద్ద టీడీపీ నాయకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు.


పాదయాత్రను ప్రారంభిస్తున్న చినవెంకటరెడ్డి

పురందేశ్వరికి బీజేపీ నేతల శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 20 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని అద్దంకి బిజేపీ నేతలు గురువారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కిసాన్ మోర్చా జో నల్ ఇన్‌చార్జి పర్చూరు శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ మంగ మూరి సురేష్, కోశాధికారి గుడిమెట్ల అశోక్‌కుమార్ ఉన్నారు.



గోరంట్లకు మంత్రుల అభినందనలు

అద్దంకి, జూన్ 20 : ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేసిన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని గురువారం రాజభవన్ వద్ద విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గొట్టిపాటి రవికుమార్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



23న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

పంగులూరు, జూన్ 20 : పంగులూరులో ఈనెల 23న ఉచిత మెగా కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు క్యాంప్ ఇన్‌చార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ నేత్రాలయం పెదకాకాని గుంటూరు వారి సంయుక్త సహకారంతో రోటరీ క్లబ్ భవన ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో కంటి పరీక్షలు చే యించుకనే వారు ఆధార్, ఆ రోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని కోరారు.

భక్తుల కొంగుబంగారం కనకనాగవరపమ్మ

అరుగు, రెయిలింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూన్ 20 : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కనకనాగవరపమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. రావూరిపేటలోని నాగారపమ్మ అమ్మవారి ప్రాంగణంలోని వేపచెట్టు చుట్టూ నిర్మించిన అరుగును, రెయిలింగ్‌ను గురువారం ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో జరిగే ఉత్సవాలు, శిడిమాను ఉత్సవ ప్రత్యేకతను ఆయల అర్చకులు వివరించారు. సంతరావూరుకు అమ్మవారికి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


నూతనంగా నిర్మించిన రెయిలింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రూ.20వేల విలువైన పుస్తకాల పంపిణీ

మేదరమెట్ల, జూన్ 20 : మండలంలోని యర్రబాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దాతలు పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం యర్రబాలెంకు చెందిన మోరవినేని శైలేష్‌బాబు రూ.20వేల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులు, టేబుల్ బుక్స్ , కాపీ నోట్‌బుక్స్, అట్టలు, పలకలు, విద్యార్థులకు అందించారు. సుమారు రూ.20వేల విలువైన ఈ పుస్తకాలను సర్పంచ్ బలుమూరి నాగరాజు గ్రామ పెద్దలు మోరవినేని కోటేష్‌బాబు, మావిళ్లపల్లి శ్రీహరిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నెం శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు శ్రీ లక్ష్మి సమక్షంలో విద్యార్థులకు పంపిణి చేశారు. ఈ సంవత్సరం నుంచి పాఠశాలకు విద్యార్థుల రాకపోకలకు ఉచిత ఆటోను గ్రామస్థులు ఏర్పాటు చేశారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

టీజీ భరత్‌ను కలిసిన ఆర్యవైశ్య నాయకులు

మేదరమెట్ల, జూన్ 20 : కర్నూలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన టీజీ భరత్‌ను ఆర్యవైశ్య నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మద్దాళి సంజీవరావు, రాష్ట్ర ఆర్గనైజర్ పల్లబోతు వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజర్ బైయా ఆంజనేయులు, మద్దాళి రాఘవరావు తదితరులు ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ఆధ్వర్యంలో టీజీ భరత్‌ను కలిసి అభినందనలు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ కొలుపులు

నాగులపాలెం(పర్చూరు), జూన్ 20: పర్చూరు మండలం నాగులపాలెం గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి కొలుపులను గురువారం భక్తిశ్రద్ధలో నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలని కోరుతూ ప్రతి ఏటా అమ్మవారికి కొలుపులు జరుపుకోవడం ఆనవాయితీ. ఉదయం నుంచే ఆలయంలో భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం మేళ తాళాలతో అ మ్మవారిని పురవీధుల్లో మేళ తాళాలతో సంబరాలు నిర్వహించారు. భక్తులకు ఎలాం టి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



23న సాహితీ మిత్ర మండలి సమావేశం

అద్దంకిటౌన్, మే 20 : అద్దంకిలోన సాహితీ మిత్ర మండలి సమావేశం ఈ నెల 23వ తేదీన స్థానిక మారంవారి సేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని మిత్ర మండలి సభ్యులు పుట్టంరాజు శ్రీరామచ్రంమూర్తి గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో ఆధ్యాత్మిక ప్రవచన కర్త, రచయిత పోలూరి వెంకటశివరామ ప్రసాదరావుకు ఆత్మీయ పురస్కారం అందించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రమాదవశాత్తు తెలుగు ఉపాధ్యాయిని దుర్మరణం

వేటపాలెం(చీరాలటౌన్), జూన్ 20 : ప్రమాదవశాత్తు మంటలకు తెలుగు ఉపాధ్యాయిని మృతిచెందారు. ఈ ఘటన గురువారం వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లిలో చోటు చేసుకుంది. చినగంజాం మండల పరిధిలోని అడవీధిపాలెం జీడ్పీ ఉన్నత పాఠశాలలో అమిరిశెట్టి శ్యామల (45) తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఆమెది వేటపాలెంలోని పందిళ్లపల్లి. అయితే ఇంట్లో గురువారం ఉదయం గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని ఉపాధ్యాయిని దుర్మరణం చెందారు. ఆమె మృతిపై పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

నైట్ హాల్ట్ బస్సులను పునరుద్ధరించాలి

మంత్రి గొట్టిపాటికి విన్నవించనున్న ప్రజలు

బల్లికురవ, జూన్ 20 : గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయెగపడే అద్దంకి చిలకలూరిపేట నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు సర్వీసును వెంటనే ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించాలి రెండు మండలాలకు చెందిన ప్రయాణికులు కోరుతున్నారు. మూడు దశాబ్దాల నుంచి అద్దంకి నుంచి అద్దంకి మండలం కలవకూరు, శంకరవప్పా డు, ధర్మవరం, బల్లికురవ మండలం వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాల మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు సర్వీసు ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న రెండు సర్వీసులలో ఒకటి రద్దు చేశారు. గతంలో రెండు సర్వీసుల్లో ఒక నైట్ హాల్ట్ అద్దంకిలో మరొకటి చిలకలూరిపేటలో ఉండేవి. ఉదయం 5 గంటలకు వచ్చే ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయోగపడేవి అధికారుల అనాలోచిత నిర్ణయంతో చిలకలూరిపేట నైట్ హాల్టు సర్వీసును రద్దు చేశారు. దీంతో రెండు మండలాల పరిధిలోని ప్రయాణికులు పట్టణ ప్రాంతాలకు ఉదయం వెళితే రాత్రి వరకు తిరిగి వచ్చే సౌకర్యం లేదు. ఎంతో కాలంగా ఈ సమస్యపై గగ్గోలు పెడుతున్న ఎవరూ పట్టించుకోలేదు. టీడీపీ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే గొట్టిపాటి మంత్రి కావడం తో బస్సు సర్వీసు సమస్యను ఆయన దృష్టికి తీసుకు వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలు సిద్ధం అవుతున్నారు. బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రమాదాలబారిన ప్రజలు పడే ప్ర మాదం పొంచి ఉందని ఆర్టీసీ అధికారులు వెం టనే అన్ని రూట్లలో బస్సులను నడిపేలా చర్య లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిచడమే లక్ష్యం

ఆర్డీవో రవీందర్

పర్చూరు, జూన్ 20 : ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ పనిచేస్తుందని ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. రెవెన్యూ దినోత్సవాల్లో భాగంగా గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో పాల్గొన్నారు. ప్రజలకు విశేష సేవలందించిన పలువురు సిబ్బందిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని శాఖలకు రెవెన్యూ శాఖ తల్లిలాంటిదని కొనియాడారు. శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న వివిధ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందిని సన్మానిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

లారీ డ్రైవర్ ఆత్మహత్య

అద్దంకి, జూన్ 20 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిని పూర్తి స్థాయి లో నడవలేని స్థితికి చేరి, కుటుంబ పరిస్థితి సరిగ్గా లేక లారీ డ్రైవర్ ఆత్మహత్య కు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని పెరికపాలెంకు చెందిన కత్తుల శేషు (50) లారీ డ్రైవర్‌గా పనిచేశారు. నాలుగు సంవత్సరాల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో పూర్తిస్థాయిలో నడవలేని స్థితికి చేరాడు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా సరిగా లేకుండా పోయింది. భార్య, కూతుళ్లు కూడా వేరుగా ఉంటున్నారు. దీంతో మరింత కుంగిపోయిన శేషు గురువారం ఉదయం గుండ్లకమ్మ బ్రిడ్జి వద్దకు చేరుకొని మోకు (లావుతాడు)తో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

భూముల రీసర్వేలో రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

- రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 20 : భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాం. రెవెన్యూ శాఖలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖామంత్రిగా 4వ బ్లాకులో వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించి పదవీ బాధ్యతలను స్వీకరించారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి రెవెన్యూ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి అనగానికి విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్థన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సాంఘీక సంక్షేమ శాఖామంత్రి బాల వీరాంజనేయ స్వామి, బీసీ సంక్షేమశాఖామంత్రి ఎస్.సవిత, బాపట్ల ఎంపి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, గల్లా మాధవి, ఎంఎం కొండయ్య, చింతమనేని ప్రభాకరరావు, మాజీ ఎంపి కొనకళ్ళ నారాయణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు, రాజధాని రైతులు, ఉద్యోగులు జీ.సాయిప్రసాద్, అజయ్‌జైన్, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రేపల్లె నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో సచివాలయానికి చేరుకుని అభినందనలు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

డీఎల్‌పీవో హనుమంతురావు


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

రామకృష్ణాపురం(చీరాలటౌన్), జూన్ 20 : ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది వివిధ నిర్వహణలో అలసత్వం వహించరాదని డీఎల్‌పీవో దారా హనుమంతురావు హెచ్చరించారు. గురువారం చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలన చేశారు. అంతేకాకుండా పంచాయతీ అభివృద్ధిపై ఇటీవల చేపట్టిన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తు తం ఎదుర్కొంటు న్న సమస్యలపై ఆరా తీశారు. పారిశుధ్యంపై విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కిరణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై జాగ్రత్తలు

చీరాలటౌన్, జూన్ 20 : మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ విధిగా జరగాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి పే ర్కొన్నారు. గురువారం కమిషనర్ గడియార స్తంభం వద్ద కార్మికుల అ టెండెన్స్ పరిశీలించారు. స్వర్ణ గేట్ వద్ద డ్రైనేజీని పరిశీలించారు. అలాగే పురపాలక సంఘం కార్యాలయం వెనుక గల మునిసిపల్ పార్కును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.




సాంబశివరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు సేవా భావంతో పనిచేయాలి

పంగులూరు, జూన్ 20 : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, భావితరాలకు విలువలతో కూడిన విద్యనందించే ఉపాధ్యాయుల సేవలు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని సీపీఎం సీనియర్ నాయకుడు నాగబోయిన రంగారావు అన్నారు. పంగులూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన శిరిగిరి సాంబశివరావు, మిడిదొడ్డి చంద్రశేఖర్ దంపతులను ప్రజా ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రాయిణి ప్రమీల వెంకటసుబ్బారావు, చందలూరు, బూదవాడ, ఎన్టీపాడు, అలవలపాడు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గిరిజ, బంగారుకొండ, రమణయ్య, గోవిందరాజులు, ఉపాధ్యాయులు శిరిగిరి శ్రీను, చిలుకూరి శ్రీనివాసరావు, నారాయణ, హరిబాబు పాల్గొన్నారు

గ్రామీణ వైద్యులకు అవగాహన

ఇంకొల్లు, జూన్ 20 : ఇంకొల్లు మండలంలోని గ్రామీణ వైద్యులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ ఏరియా సేల్స్ మేనేజర్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కొవిడ్ అనంతరం ప్రతి ఒక్కరూ గ్యాస్ ట్రబుల్‌తో బాధపగుతున్నారన్నారు. గ్రాస్ ట్ర బుల్‌పై అగాహన కలిగించారు. రోగులకు వచ్చే కడుపుమంట, గుండెలలో మంటకు తేడా తెలుసుకొని వైద్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రావినూతల శ్రీనివాసరావు, మండలంలోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 20 : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంఈవో ఎం.చిలుకూరి గోపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో స్వర్గీయ మద్దినేని బ్రహ్మానందం శకుంతల దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు జయరామకృష్ణ విద్యార్థలకు పుస్తకాలు, పెన్సిళ్లు, బలపాలను అందచేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పోపూరి నరసింహారావు చేతులమీదగా విద్యార్థులకు వాటిని అందచేశారు. మొత్తం 24 మంది విద్యార్థులకు రూ.10వేల విలువైన పుస్తకాలను అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణమ్మ, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, మద్దినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వేటపాలెం(చీరాలటౌన్), జూన్ 20 : గుంటూరులో చికిత్స పొందుతున్న కావూరి దావీదు (35) బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే వేటపాలెం మండలం హరిజనవాడకు చెందిన కావూరి దావీదు(35) రోజువారి కూలీ. ఇతను ఈనెల 17వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై వేటపాలెం నుంచి ఇంటికి వెళుతూ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈక్రమంలో అపస్మారక స్థితిలో చేరిన అతడిని కుటుంబ సభ్యులు ఒంగోలు రిమ్స్‌లో చేర్చి, అనంతరం గుంటూరుకు తరలించారు. ఆరోజు నుంచి చికిత్స పొందుతున్న దావీదు బుధవారం రాత్రి మృతిచెందాడు. గుంటూరు ఆసుపత్రిలో గురువారం పోస్టుమార్టం జరిగింది.

ఏల్చూరులో విద్యుత్ తీగల చోరీ

సంతమాగులూరు, జూన్ 20 : మండలంలోని ఏల్చూరు గ్రామంలోని ఎర్రపాలంలో బుధవారం రాత్రి బోరుబావులకు అమర్చిన విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. గ్రామానికి చెందిన సుమారు 10 మందికి చెందిన తీగల చోరీపైరైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గర్భిణి మృతిపై విచారణ

చీరాలటౌన్, జూన్ 20 : మాతృ మరణాలపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఇటీవల కాలంలో జాండ్రపేటకు చెందిన చేవూరి నాగమణి చీరాల ఏరియా హాస్పిటల్‌లో డెలివరీ అయింది. అనూహ్యంగా రక్తస్రావం అధికం కావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో హాస్పిటల్ సూపరింటెండెంట్ సుభాషిణి, వైద్యులతో జిల్లా అధికారి సమావేశం నిర్వహించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. సిబ్బంది విధిగా వైద్య సేవలందించాలని సూచించారు. వైద్యులు పాల్గొన్నారు.









